


# కండక్టర్ కరుణాకరం

సారె రామమోహనరావు

విజయనగరం– విశాఖపట్నం ఆర్.టి.సి బస్సు ముందుకు దూసుకుపోతూంది. కండక్టర్ కరుణాకరం టిక్కెట్లు కట్ చేసుకుంటూ వస్తున్నాడు. అతని చూపు నిలబడివున్న డాక్టర్ శ్రీనివాసరావు మీద పడింది. ఆనందంతో తలమునక లయాడు.

"ఒరేయ్ శ్రీనూ! బాగున్నావా?" ఆప్యాయంగా అడిగాడు కరుణాకరం.

శ్రీనివాసరావు ముఖం సీరియస్‌గా మారింది. కరుణాకరం అతనిని "ఒరేయ్" అని అనడం అతనికి మరింత కోపం వచ్చింది.

తెలియనివాడిలా ముఖం పెట్టి "నువ్వెవరో నాకు తెలీదు" అని అన్నాడు.

కరుణాకరం కొద్దిగా బాధపడ్డాడు.

"నేనండీ! కరుణాకరాన్ని. మనిద్దరం చిన్నప్పటి నుండి పి.యు.సి. దాకా కలిసి చదువుకున్నాం. అప్పుడే మరచి పోయారా?" బహువచన ప్రయోగం చేశాడు కరుణాకరం.

శ్రీనివాసరావు కొంచెంసేపు ఆలో చించినవాడిలా ముఖం పెట్టాడు. నిజానికి శ్రీనివాసరావుకు ఆ సమయంలో ఆలో చించాల్సిన అవసరం లేదు. ఏంచేతంటే చిన్నతనంనుంచీ అతనికి కరుణాకరం బాగా తెలుసు. కానీ తన డాబుని, దర్పాన్ని ప్రదర్శించుకోడానికి అతనలా ముఖ భంగిమ మార్చాడు.

"ఓ! నిన్ను పోల్చుకున్నాను కరుణా కరం" అని అన్నాడు ముక్తసరిగా.

"నువ్వు ఈ వూళ్ళోనే ప్రాక్టీస్ పెట్టావటగా! మన ఫ్రెండ్స్ ఎవరో చెబితే విన్నాను, నువ్వు డాక్టర్‌వి అయా వని" ఆనందంగా అన్నాడు కరుణాకరం.

శ్రీనివాసరావు ముఖంలో మళ్ళీ కోపం చోటుచేసుకుంది. కండక్టర్ కరుణాకరం తనని మళ్ళీ "నువ్వు" అని సంబోధించి నందుకు. అఫ్టాల్ ఓ కండక్టర్ తనని "నువ్వు" అని అంటాడా!

"ఈరోజు నాకు చాలా ఆనందంగా వుంది. శ్రీనూ! నా మిత్రుడు డాక్టర్ అయినందుకు నాకెంతో ఆనందంగా వుంది" ఆప్యాయంగా అతని గుండె లోతుల్లోంచి చీల్చుకొచ్చిన మాటలవి.

అతనిని కరుణాకరం మళ్ళీ "నువ్వు" అని సంబోధించినందుకు మళ్ళీ కోపం వచ్చింది. ఏమీ మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాడు.

"ఎందాకా? భీమునిపట్నానికా?" అడిగాడు కరుణాకరం.

"లేదు. వైజాగే." ముక్తసరిగా సమాధాన మిచ్చి, జేబులోంచి పది రూపాయలనోటు తీసి, కరుణాకరానికి అందించబోయాడు.

"ఫర్వాలేదు. నీ దగ్గరే వుంచు. ఇంతకాలానికి మనం ఈ విధంగా కలుసుకున్నందుకు నాకెంతో ఆనందంగా వుంది. నా మిత్రుడువయిన నిన్ను.... నీ దగ్గర టిక్కెట్‌కు డబ్బులు తీసు కుంటానా!" అంటూ కరుణాకరం ఆ నోటును అందుకోలేదు.

"పోనీలే. వీడి పుణ్యమా అంటూ టిక్కెట్ డబ్బులు మిగిలాయి," అని అనుకుని మాట్లాడకుండా జేబులో వేసు కున్నాడు ఆ నోటును. శ్రీనివాసరావు కనీసం కరుణాకరానికి "థాంక్స్" కూడా చెప్పలేదు.

కరుణాకరం ఇదేమీ పట్టించుకోలేదు. గబగబా శ్రీనివాసరావు భుజం పట్టుకుని లాగుతూ తీసుకెళ్ళి తన కండక్టర్ సీట్లో అతనిని కూర్చోబెట్టాడు.

మాట్లాడకుండా ఆ సీట్లో కూర్చు న్నాడు శ్రీనివాసరావు. టికెట్స్ కట్ చెయ్యడానికి మళ్ళీ వెనక్కి వెళ్ళిపో యాడు కరుణాకరం.

"అప్ట్రాల్ ఓ కండక్టర్ తనని 'నువ్వు' అని సంబోధిస్తాడా!" అని మళ్ళీ అనుకున్నాడు శ్రీనివాసరావు. తను డాక్టర్ కాబట్టి తన హోదాకు, దర్జాకు తగ్గట్టుగా కరుణాకరం తనకి సీటు ఇవ్వడం అతని బాధ్యత అని అనుకున్నాడు. "స్నేహం" అని అనుకోలేదు. అతని హోదా అలాంటిది మరి!

కరుణాకరం అందరివద్ద టికెట్స్ కట్ చేసి శ్రీనివాసరావు దగ్గరకు వచ్చాడు.

కరుణాకరం నిలబడే వున్నాడు. కారణం: తన మిత్రునికి తన సీటు ఇచ్చేయడం. అతని మనసు ఎంతో ఆనందంగా వుంది. తన మిత్రునికి ఈ విధంగా టికెట్ తీసుకోకుండా తన సీటు ఇచ్చేయడం నిజంగా తన అదృష్టం అని అనుకున్నాడు.

"ఇంతకూ వైజాగ్ ఏ పనిమీద వెళ్తున్నావ్ శ్రీనూ?" అని అడిగాడు కరుణాకరం.

"నేను మెడిసన్ చదివేటప్పుడు నా క్లాస్‌మేట్, రూమ్మేట్ అయిన నా స్నేహితుడి దగ్గరకు వెళ్తున్నాను. అతని పేరు సింహాద్రినాథ్. రెండేళ్ళు గడిచాక డాక్టరీ చదవడం మానేసి సినిమాల్లో చేరిపోయాడు. ఇప్పుడతను పేరు మోసిన పెద్ద హీరో. షూటింగ్ నిమిత్తం వైజాగ్ వచ్చాడు. వాణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను." గర్వంగా సమాధానమిచ్చాడు శ్రీనివాసరావు.

"చాలా సంతోషం" అన్నాడు కరుణాకరం. అతను ఆప్యాయంగా ఇంకా ఎన్నెన్నో తమ చిన్ననాటి కబుర్లు చెప్పడం ప్రారంభించాడు. శ్రీనివాసరావు అతని మాటలేవీ ఆలకించకుండానే ఆలకిస్తున్నట్టుగా నటిస్తూ 'వూఁ' అని అనేస్తున్నాడు కాని, తన చిన్ననాటి చేష్ట ఒక్కటికూడా కరుణాకరంతో చెప్పలేదు.

కరుణాకరం వాగుతూంటే — శ్రీనివాసరావు "వూఁ" కొడుతూంటే — బస్సు విశాఖ చేరింది.

"నువ్వు నన్ను మళ్ళీ కల్సుకోవాలంటే రేపు ఆర్.టి.సి. బస్‌డిపోకు పది గంటలకు రా! నే నక్కడే వుంటాను. మన మిద్దరం కలిసి ఏదైనా పార్టీ చేసుకుందాం. నువ్వు తప్పకుండా వస్తే నా డ్యూటీ మరొకరికి అంటగడ్తాను. ఏమంటావ్?" అన్నాడు కరుణాకరం.

శ్రీనివాసరావు మాట్లాడకుండా బస్ దిగిపోయాడు. దిగుతున్నప్పుడు కనీసం 'వస్తాను కరుణాకరం' అని కూడా అనకుండా బస్ దిగిపోయాడు. పైపెచ్చు 'అప్ట్రాల్ ఓ కండక్టర్‌కు నేను చెప్పి వెళ్ళడమేమిటి?' అని అనుకున్నాడు.

బస్సంతా పూర్తిగా ఖాళీ అయింది.

కరుణాకరం ఆ టిక్కెట్ చింపి జేబులోంచి తీశాడు. అది డాక్టర్ శ్రీనివాసరావు టిక్కెట్. ఆ టిక్కెట్ ముక్కల్ని తన చేతిలో పెట్టుకున్నాడు కండక్టర్ కరుణాకరం.

* * *

సన్ అండ్ సీ రూమ్ నంబర్ నైన్ ముందు నిలబడి తలుపు తట్టాడు డాక్టర్ శ్రీనివాసరావు. తలుపులు వాటికవే తెరుచుకున్నాయి.

ఎదురుగా తన స్నేహితుడు సినీహీరో సింహప్రసాద్ ఓ కుర్చీలో కూర్చు న్నాడు. అతని పక్కనే వున్న మరో రెండు కుర్చీల్లో ఇద్దరు ఆడవాళ్ళు కూర్చున్నారు.

"ఎవరు మీరు?" హీరో సింహ ప్రసాద్ అడిగాడు.

"నేనురా! డాక్టర్ శ్రీనివాసరావుని. నీ మిత్రుడిని. నీ రూమ్మేట్ని. నీ క్లాస్ మేట్ని," అన్నాడు శ్రీనివాసరావు.

"ఓ సుబ్బూ! బాగున్నావా? ఇలా వచ్చావేం?" అడిగాడు సింహప్రసాద్.

"నిన్ను చూడాలనే ప్రత్యేకంగా వచ్చాను," అన్నాడు శ్రీనివాసరావు.

"రా! కూర్చో" అంటూ పక్కనే వున్న మరో సీటు చూపించాడు సింహ ప్రసాద్.

ఎంతో ఆనందంగా వెళ్ళి ఆ కుర్చీలో కూర్చున్నాడు శ్రీనివాసరావు.

సింహప్రసాద్ ఆ ఇద్దరాడాళ్ళను పరిచయంచేశాడు. ఓ యువతి అతని పక్కని హీరోయిన్ అట. మరో అమ్మాయి సైడ్ హీరోయిన్ అట.

కుశలప్రశ్నలయ్యాయి.

"నేను నీ మిత్రుడిని కదా! నాకోసం ఏం తెచ్చావ్?" కృష్ణుడు కుచేలుడిని అడిగినట్లు అడిగాడు సింహప్రసాద్. అతనికి తప్పక తెలుసు. తను, శ్రీనివాసరావు మెడిసన్లో మందుకొట్టే వాళ్ళని. శ్రీనివాసరావు తప్పక అదే అరేంజ్ చేస్తాడని.

శ్రీనివాసరావు నవ్వాడు. "నీకోసం ఏమీ తేలేదు కాని .... తేవాల్సిందేదో ఇక్కడినుంచే తెప్పిస్తాను," అన్నాడు.

"ఏమిటది?"

"మర్చిపోయావా? మనం మెడిసన్ చదివేటప్పుడు అప్పుడప్పుడు మందు పుచ్చుకునేవాళ్ళం. అదే ఇప్పుడు నీకు ఎరేంజ్‌చేస్తాను" అన్నాడు శ్రీనివాసరావు.

"మరి వీళ్ళ మాటేమిటి?" అడిగాడు సింహప్రసాద్, ఆ ఇద్దరి హీరోయిన్లను చూపించి.

"మీరూ తాగుతారా?"

"వై నాట్. ష్యూర్" ఆ ఇద్దరు హీరోయిన్లూ ఒకేసారి అన్నారు.

శ్రీనివాసరావు పొంగిపోయాడు.

సింహప్రసాద్ ఫోన్ఎత్తి రిసెప్షనిస్టుతో బాయ్ని పైకి పంపమన్నాడు.

బాయ్ వచ్చాడు.

శ్రీనివాసరావు మందుకు, మందులో నంజుకోడానికి కోడి వేపుడు, కాజూ నట్స్‌కు ఆర్డరిచ్చాడు.

బాయ్ అవన్నీ తీసుకువచ్చాడు.

గ్లాసులమీద గ్లాసులు ఖాళీచేస్తున్నారు.

శ్రీనివాసరావుకి మత్తు బాగా పెరిగి పోయింది.

మేనేజర్ బాయ్‌చేత బిల్లు పంపాడు.

బిల్లు ఆరొందలయింది.

శ్రీనివాసరావు ఆనందంగా బిల్లు చెల్లించాడు. ఆ తరువాత అతనికి మత్తు మరింతగా పెరిగిపోవడంతో కుర్చీలో పక్కకు ఒరిగిపోయాడు.

* * *

మర్నాడు శ్రీనివాసరావుకి తెలివి వచ్చేసరికి సన్ అండ్ సీ బయట గోల్ చక్కర్ మీద పడివున్నాడు. "ఇదేమిటీ ఇక్కడ వున్నాను," అని ఆశ్చర్యపోయాడు. చొక్కా జేబులోంచి ఓ కాగితం అతనిని తొంగిచూసింది. కుతూహలంగా తీసి చదివాడు.

శ్రీనివాసరావూ!

ఆఫ్టాల్ నువ్వో డాక్టర్‌వి. నీతో నాకు స్నేహమేమిటి చెప్పు? నువ్వు నన్ను "వురేయ్" అని సంబోధించినప్పుడే నాకెంతో కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాను. ఎందుకో తెలుసా? ఎఫ్‌స్‌గా నీదగ్గర మందుకొట్టొద్దామని. నేను "కో" అంటే కోటిమంది డాక్టర్లు నా ముందు మోకరిల్లుతారు. నువ్వనగా నాకెంత? ఎం.బి.బి.ఎస్. నేను రెండు సంవత్సరాలే చదివినా నీకూ నాలాగే మందు అలవాటుందని తెలుసు కాబట్టి నీచేత మందుకు ఆరొందలు ఖర్చుపెట్టించాను. నేనొక యాక్టర్‌ని. యాక్టర్ ముందు డాక్టరెంత? మళ్ళీ లోపలికొచ్చి నాతో మాట్లాడే ప్రయత్నం చెయ్యకు. మళ్ళీ నిన్ను బేరర్ల చేత బయటికి గెంటించాల్సి వుంటుంది. గుడ్ బై!

— సింహప్రసాద్.

శ్రీనివాసరావు మనసు చివుక్కుమంది. అతనికి ఆ సమయంలో కండక్టర్ కరుణాకరం గుర్తుకు వచ్చాడు. అతనిని లెక్కచెయ్యనందుకు చింతించాడు. "అమృతంలాంటి మనసు గల కరుణాకరాన్ని లెక్కచెయ్యక, విషంలాంటి సింహప్రసాద్‌ను లెక్కచేసినందుకు నాకు తగిన శాస్తి జరిగింది," మనసులోనే బాధగా అనుకున్నాడు.

"నువ్వు నన్ను మళ్ళీ కలుసుకోవాలంటే రేపు ఆర్.టి.సి. బస్‌డిపోకు పదిగంటలకు రా! నేనక్కడే వుంటాను. మన మిద్దరం కలిసి ఏదైనా పార్టీ చేసుకుందాం. నువ్వు తప్పకుండా వస్తే నా డ్యూటీ మరొకరికి అంటగట్టేస్తాను. ఏమంటావ్?" అన్న కరుణాకరం మాటలు గుర్తుకువచ్చి వాచ్ చూసుకున్నాడు. పావు తక్కువ తొమ్మిది. గబగబా ఆటోకోసం ముందుకు నడిచాడు. కండక్టర్ కరుణాకరాన్ని కలుసుకుని క్షమాపణలు చెప్పుకోడానికి అతనితో కలిసి పార్టీచేసుకోడానికి. ఇప్పుడు డాక్టర్ శ్రీనివాసరావు మనసు ఎంతో ఆనందంగా వుంది.

---